నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం | ఏప్రిల్ 07, 2025 | www.navatelangana.com

కందకుర్తిలో ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలం కందకుర్తి గ్రామంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మహారాష్ట్ర నుంచి అనేకమంది మల్ల యోధులు వచ్చి తలపడ్డారు. కుస్తీ పోటీలో మొదటి బహుమతిగా 10 తులాల వెండి, ద్వితీయ విజేతకు ఐదు తులాల వెండి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, తదితరులు పాల్గొన్నారు.



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

పీసీసీ చీఫ్ పూజలు

- శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న మహేశ్‌కుమార్‌గౌడ్, నాయకులు



నవతెలంగాణ-భీంగల్ రూరల్/ఆర్మూర్

భీంగల్ మండలం పిప్రి గ్రామంలో శ్రీ లొద్ది రామన్న స్వామి ఆలయంలో శ్రీ రామనవమి వేడుకల్లో పీసీసీ చీఫ్ మహేహ్‌కుమార్ గౌడ్ సతీసమేతంగా పాల్గొని పూజలు చేశారు. భీంగల్ మండలం రాత్‌నగర్ గ్రామానికి చెందిన పిసిసి చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను.. పిప్రి గ్రామస్తులు మండలంలోని లొద్ది రామన్న రామనవమికి తప్పకుండా రావాలని కోరడంతో వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతారామ కళ్యాణంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్, టీజీఎండిసి చైర్మన్ ఇరవత్రి అనిల్, మండల యూత్ అధ్యక్షులు, మండల మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఆర్మూర్ సిద్దుల గుట్టలో పూజలు నిర్వహించారు.





కన్నుల పండువగా..
సీతారాముల కల్యాణం

- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- భక్తులతో కిటకిలాడిన రామాలయాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

శ్రీరామనవమి వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేడుకగా నిర్వహించారు. భక్తుల తాకిడితో రామాలయాలు కిటకిటలాడాయి. ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

నగరంలోని ఖిల్లా రామాల యంలో సీతారాముల కళ్యాణం వేడుక ఘనం గా నిర్వహించారు. శ్రీరాముని వివాహ మహోత్సవానికి ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కళ్యాణ ఘట్టంలో ముఖ్యమైంది మధుపర్కం, జీలకర్ర, బెల్లం, కన్యాదానం, మంగళసూత్రధారణ, తలంబ్రాలు తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితులు పురోహితుల ఆధ్వర్యంలో కళ్యాణం జరపగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా సీతారామ చంద్రుని కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.

ఆలయ కమిటీ చైర్మన్ అధ్యక్షులు చెరువుపల్లి గురుప్రసాద్, సెక్రెటరీ మారయ్య గౌడ్, కోశాధికారి పెండ్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

అదే విధంగా నగరంలోని న్యాల్కల్ రోడ్డు వద్ద గల అయోధ్య నగ ర్ కోదండ రామాలయంలో శ్రీరామ నవమి వేడు కలు ఆలయ కమిటీ అధ్యక్షులు మూ ఢ బాలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీరాముని వృక్ష విగ్రహాలకు అభిషేకం అలంకరణ నామకరణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

అదే విధంగా నగరంలోని సుభాష్‌నగర్ రామాలయంలో, ఆర్యనగర్ రామాలయంలో సీతారాముల కళ్యాణ వేడుక ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. జెండా బాలాజీ ఆలయంలో తదితర చోట్ల వేడుకలు నిర్వహించారు.



వేడుకల్లో పాల్గొన్న పలువురు

పోస్టుకోసం
పైరవీ

ఆరోగ్య శ్రీలో మేనేజర్ పోస్టుకు ఎమ్మెల్యేతో రికమెండేషన్

- కలెక్టరేట్‌కు చేరిన రెండు రికమెండేషన్ లెటర్‌లు
- ఏటూ తేల్చలేకపోతున్న అధికారులు
- సిఫారసుతో కాకుండా.. నోటిఫికేషన్ వేసి భర్తీ చేయాలని
- కోరుతున్న చేస్తున్న నిరుద్యోగులు
- ఆరోగ్యో శ్రీలో జీఎం పోస్టుతో పాటు ఇతర ఖాళీలను
- భర్తీ చేయాలని డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆరోగ్య శ్రీలో డీఎం (డిస్టిక్ మేనేజర్) పోస్టును అంతర్గతంగా భర్తీ చేసేందుకు సన్నాహాలు కొనసాగుతున్నట్టు తెలిసింది. ఇందుకోసం రెండు రికమెండేషన్ లెటర్‌లు సైతం కలెక్టరేట్‌కు చేరుకున్నాయి. వాస్తవానికి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను ఎంపిక చేయాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా రికమెండేషన్‌తో ఆ పోస్టు దక్కించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య శ్రీలో డీఎం తో పాటు జిల్లా కోఆర్డినేటర్, ఆరోగ్య మిత్ర ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంది. పైరవీలు పక్కనపెట్టి వీటన్నింటికీ కలిపి నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

నెలల వ్యవధిలో రెండు లెటర్‌లు

నిజామాబాద్ జిల్లా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ లో గత కొన్ని సంవత్సరాలుగా డిస్ట్రిక్ట్ మేనేజర్ (డిఎం) పోస్టు కరోనా కాలానికి ముందు నుంచే ఖాళీగా ఉంది. డిస్టిక్ కోఆర్డినేటర్ (డిసి) విధులు నిర్వర్తించిన వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం రావడంతో ఇక్కడ మానేశారు. దాంతో ఆ పోస్టు సైతం ఖాళీ అయింది. ఆదిలాబాద్ డిఎంగా ఉన్నవారు నిజామాబాద్ జిల్లా ఇన్చార్జిగా డిఎంగా విధులు నిర్వహిస్తున్నారు. డిస్టిక్ కోఆర్డినేటర్ బాధ్యతలు హైదరాబాద్ నుండి ఇంచార్జి బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

ఇన్ని రోజులు భర్తీ చేయకుండా ఆ పోస్టులను అలానే ఖాళీగా ఉంచారు. అయితే తాజాగా డిస్టిక్ మేనేజర్ (డిఎం) పోస్టుకు ప్రస్తుతం డిమాండ్ నెలకొంది. ఓ వ్యక్తి పేరు సూచిస్తూ జనవరి 18వ తేదీన ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్-హైదరాబాద్ పేరుతో ఓ రెఫరెన్స్ లెటర్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరింది. మరో వ్యక్తిని ఓ ఎమ్మెల్యే రికమెండేషన్ చేసినట్టు ఉన్న మరో లెటర్ మార్చి నెలలో వచ్చింది. నెల వ్యవధిలో ఇద్దరి పేర్లు రిఫర్ చేస్తూ రావడంతో ఎవరిని నియమించాలో తెలియక సంబంధిత అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

ఓ ఎమ్మెల్యే నుంచి వచ్చిన రిఫరెన్స్ లెటర్‌లో తేదీలు వేర్వేరుగా ఉండటం గమనార్హం. ఏడాది క్రితమే ఎమ్మెల్యే నుంచి రిఫరెన్స్ తీసు కున్నట్టు ఉండగా.. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌కు చేరుకోవడానికి సంవత్సరకాలం పట్టిందా అని అధికారులు ముక్కున వేలేసుకుంటు న్నారు. హైదరాబాద్ నుంచి ఓ రెఫరెన్స్ వచ్చినట్టు సమాచారం అందడంతో అంతకంటే ముందు తేదీతో రికమెండేషన్ లెటర్ ఉండటం గమనార్హం. కాగా సదరు వ్యక్తి గతంలో ఆరోగ్య శ్రీలో విధులు నిర్వర్తించి వేతనం తక్కువ వస్తుందని మానేసినట్టు సమాచారం. ఒకసారి మానేసిన వారికి ఆరోగ్య శ్రీలో మరోసారి అవకాశం ఇవ్వరు. ప్రస్తుతం ఆరోగ్య శ్రీ లోని లొసుగులు తెలుసుకొని డబ్బులు దండుకోవడమే లక్ష్యంగా డీఎం పోస్టు కోసం పైరవీలకు పాల్ప డుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇలాంటి వారికి పోస్టు కట్టబెడితే అనేక అక్రమాలు జరిగే అవకాశం ఉందని ఆరోపణలు వ్యక్తమవుతు న్నాయి.

నోటిఫికేషన్ వేయాలని నిరుద్యోగుల డిమాండ్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరోగ్య శ్రీని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీని కింద అందించే వైద్య సేవల్లో భాగంగా ఖర్చు పరిమితిని రూ.10 లక్షలకు పెంచింది. ఆరోగ్య శ్రీని బలోపేతం చేయ డమే లక్ష్యంగా కృషి చేస్తుంది. దీంట్లో భాగంగా జిల్లాలో ఆరోగ్య శ్రీలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఒక జిల్లా మేనేజర్, జిల్లా కోఆర్డినేటర్ పోస్టులతో పాటు టీం లీటర్ పోస్టులు 6 ఖాళీగా ఉన్నాయి. ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుల్లో ఒకటి ఖాళీగా ఉంది. ఆరోగ్య మిత్రలు 102 పోస్టులకు గాను ప్రస్తుతం 63 మంది పనిచేస్తున్నారు. ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

జిల్లాలో సైతం ఎంతోమంది నిరుద్యోగులు ఎంబీఏ పూర్తి చేసి వైద్య ఆరోగ్యశాఖలోని మార్కెటింగ్‌లో అనుభవం కలిగినవారు ఉన్నారు. నోటిఫికేషన్ జారీ చేసి అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్‌లు వ్యక్తమవుతు న్నాయి. అలా కాదని సిఫార్సుల ఆధారంగా ఎంపిక చేస్తే పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధమ వుతామని నిరుద్యోగులు స్పష్టం చేస్తున్నారు.

నోటిఫికేషన్ వేసి తీరాలి

పిట్ల నరేష్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత ఎన్నో ఇబ్బందులకు గురి అవుతుంటే... రాజకీయ నాయకులు, ఎమ్మెల్యేలు గుట్టు చప్పుడు కాకుండా రిఫరెన్స్ ఇవ్వడం సరైందికాదు. అంతేకాకుండా ఏ ఉద్యోగానికైనా నోటిఫికేషన్లు వేసి భర్తి చేస్తేనే నాణ్యత గల ఉద్యోగస్తులు వస్తారు. తద్వారా ప్రజలకు కావాల్సిన విధంగా సౌకర్యాలు అందిస్తారు. ఆరోగ్య శ్రీలో ఖాళీలన్నీ నోటిఫికేషన్ వేసి భర్తీ చేయాలి. లేకుంటే ఆందోళనలకు చేపడతాం.





ఎట్టకేలకు ధాన్యం కొనుగోలు

- నవతెలంగాణ కథనంతో కదలిక
- తూకం ప్రారంభించిన నిర్వహకులు



ధాన్యం తూకం వేస్తున్న నిర్వాహకులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ఎట్టకేలకు వరి ధాన్యం కొనుగోళ్ల కాంటాలు ప్రారంభమయ్యాయి. బాన్సువాడ డివిజన్ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రజా పతినిధులు ప్రారంభించి వారాలు గడుస్తున్నా ధాన్యం సేకరించకపోవడంతో అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడిచి రైతులు నష్టపోతే అవకాశం ఉందన నవతెలంగాణ దినపత్రికలో 'ఎక్కడి ధాన్యం అక్కడే' శీర్షికతో రైతుల ఆవేదనను కథనం రూపంలో ప్రచురించడంతో అధికారులు స్పందించారు. ఆదివారం బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల్లో ఎట్టకేలకు ధాన్యం కొనుగోలు కాంటాలను ప్రారంభించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల ద్వారా రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శులు తెలిపారు.

నసురుల్లాబాద్ మండలం దుర్గి సొసైటీ పరిధిలో మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా, మిర్జాపూర్, సొసైటీ పరిధిలో రెండు, నాచుపల్లి సొసైటీ పరిధిలో రెండు దాన్యం కాంటాలు ప్రారంభమయ్యాయి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు కార్యదర్శులు తెలిపారు. బీర్కూరు మండలం బైరాపూర్ గ్రామంలో 720 బస్తాలు కొనుగోలు చేసి ధాన్యం లారీల ద్వారా రైస్‌మిల్లులకు తరలించారు. నాచుపల్లి సొసైటీ పరిధిలో రెండు దాన్యం కాంటాలను ప్రారంభించి సుమారు 800 బస్తాలను కొనుగోలు చేసినట్లు కార్యదర్శి మోహన్ తెలిపారు. దుర్గి సొసైటీ పరిధిలో సుమారు 1000 బస్తాలు పైగా కొనుగోలు చేసినట్లు కార్యదర్శి సుధాకర్ తెలిపారు. అకాల వర్షం కారణంగా కోసిన ధాన్యం తడిసిపోవడంతో తేమ శాతం రాకపోవడంతో కొంత జాప్యం జరుగుతుందని తెలిపారు.

నవతెలంగాణ స్పందన

బీటి రణదివే ఆశయాలను కొనసాగిద్దాం

- వర్థంతి సభలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీటి రణదివే ఆశయాలను కొనసాగిద్దామని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. కార్మిక ఉద్యమ నాయకులు, సీఐటీయూ అఖిల భారత వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ బిటి రణదీవే 35వ వర్ధంతి సందర్భంగా ఆదివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న కామ్రేడ్ బీటీ రణదీవే.. సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులుగా 1970లో పనిచేశారని తెలిపారు. వారిది మధ్యతరగతి కుటుంబమని వారి తండ్రి ఆదాయపు పన్ను అధికారిగా పనిచేశారని తెలిపారు. చిన్న నాటి నుండి చదువులో ముందున్నారని, చదువుతోపాటు రాజకీయాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారి స్నేహితులకు రాజకీయాలు వివరించేవారని అన్నారు. మొదట టెక్స్టైల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, తర్వాత రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించారన్నారు. 1928లో కమ్యూనిస్టు పార్టీ సభ్యులు అయ్యారని నాటి నుండి ఏఐటీయూసీ నాయకులుగా 1969 వరకు క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. 1947లో భారతదేశానికి స్వాతంత్రం వచ్చాక ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో సంస్కరణ ధోరణి రావడం వల్ల కార్మిక వర్గానికి నష్టం చేసే ధోరణులు వచ్చాయని స్వాతంత్రం వచ్చాక కమ్యూనిస్టు ఉద్యమంలో పార్టీలో రెండు పెడదారులు ఉండడంవల్ల 1964 ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి సీపీఐ(ఎం) విడిపోవడం జరిగిందని.. బిటి రణధీవే సీపీఐ(ఎం)లోనే ఉంటూ ఏఐటియుసిలో చురుకుగా పని చేశారని తెలిపారు. కార్మికులకు వ్యతిరేకంగా యజమా నులకు అనుకూలంగా ఉమ్మడి కార్మిక సంఘంలో పనిచేయడం సాధ్యం కానీ స్థితిలో 1970లో ఐక్యతా పోరాటమనే నినాదంతోని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ)ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సీఐటీయూకు మొట్టమొదటి అధ్యక్షులుగా 1970లో ఎన్నికయ్యారని అన్నారు. జౌలి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న కార్మికుల ఉద్యమ నాయకురాలు విమలాను 1949లో వివాహం చేసుకున్నారని అన్నారు. 1979లో శ్రామిక మహిళల మహా సభలు నిర్వహిం చారని శ్రామిక మహిళల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిం చాలని, దేశంలో సగభాగంగా ఉన్న మహిళలు ఉద్య మాల్లోకి రావాలని, వారిని ప్రోత్సహిం చాలని అన్నారు. వారి ప్రత్యేక సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కులం - మతం వ్యక్తిగతంగా ఉండాలి.. కానీ కులం తో పాటు కులతత్వం ఉండరాదు. కుల ఉన్మాదం ఉండరాదని, మతం ఉండొచ్చు వ్యక్తిగతం మత ఉన్మాదం ఉండరాదని, కులం - మతం- లింగం స్త్రీపురుష తేడాలతో విడిపోతే కార్మికులు నష్టపోతారని యజమానులకు, పెట్టుబడిదారులకు ,పాలకులకు లాభాలు, కార్మిక వర్గానికి నష్టాలు, కష్ట కాలం వస్తుందని ఐక్యత చీలకుండా ఉద్యమం నిర్మించాలని పిలుపునిచ్చారు. కులం- వర్గం- ఆస్తి సంబంధాలు అని పుస్తకాన్ని కామ్రేడ్ బి టి రణదివే రచించారని వీటిని వారు జీవించినంత కాలం సోషలిజం స్థాపన కోసం కృషి చేశారని అనేక దఫాలుగా పోలీసుల స్టేషన్ లు అరెస్టులు జైలుకు వెళ్లినట్టు తెలిపారు. సంవత్సరాల తరబడి జైల్లో గడిపారని జైల్లో కూడా ఖైదీల సమస్య పరిష్కారం కోసం ఉద్యమించారాని ఖైదీలకు మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని క్లాసులు బోధించినట్టు తెలపారు. మార్క్సిజం - లేనినిజం మార్గంలో కార్మిక వర్గ రాజ్య స్థాపన కోసం పనిచేయడమే కార్మిక వర్గాన్ని ఐక్యంగా నిలబెట్టడమే కార్మిక వర్గాన్ని ఒక వర్గంగా ఐక్యం చేయడమే కామ్రేడ్ బి టి రణదివేకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కటారి రాములు, బార్ధాన్ జిల్లా నాయకులు రాములు, ఇమామ్, కేద్రమ్మ, సురేష్, విజయ్, బార్ధాన్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వర్థంతి సభలో మాట్లాడుతున్న నూర్జహాన్



వర్ధంతి సభకు హాజరైన కార్మికులు, నాయకులు

ప్రధాన కూడళ్లల్లో
సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- మాచారెడ్డి చౌరస్తాలో ప్రారంభించిన ఏఎస్పీ చైతన్యరెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి(మాచారెడ్డి)

గ్రామాల్లోని ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏఎస్పీ చైతన్యరెడ్డి సూచించారు. మాచారెడ్డి చౌరస్తాలో కొత్తగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఆమె ఆదివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మాచారెడ్డి, పాల్వంచ మండల ప్రజలకు సీసీ కెమెరాల అవసరాలను తెలియజేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి సహకరించిన మాచారెడ్డి చౌరస్తా లోని దుకాణాల యజమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వీటిని నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు. అనుకోని ఘటనలు, చోరీలు చోటుచేసుకున్నప్పుడు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను సులువుగా గుర్తించేందుకు పోలీసులకు కీలకంగా పని చేస్తాయని తెలిపారు. అదే విధంగా గ్రామంలోకి కొత్త వారు వస్తుంటే వారిని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. కావున ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా వ్యాపార సముదాయాల వద్ద సైతం సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాచారెడ్డి ఎస్సై అనిల్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఏఎస్పీ

నవతెలంగాణ
నిజామాబాద్
సోమవారం | ఏప్రిల్ 07, 2025 | www.navatelangana.com

కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తకు పరామర్శ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ముదిరాజ్ వీధికి చెందిన కాంగ్రెస్ పార్టీలో అంకితభావంతో పనిచేసి సీనియర్ కార్యకర్త ఐలాపురం యాదగిరి అలియాస్ మేసిడి యాదగిరి పక్షవాతంతో మంచం పట్టడంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణా బీసీ మహాసభ నిజామాబాద్ జిల్లా కన్వీనర్ ఆదే ప్రవీణ్ కుమార్, మాజీ కౌన్సిలర్ కోనేరు సాయికుమార్ ఆదివారం పరామర్శించారు. ఈసందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. యాదగిరి పక్షవాతంతోపాటు కడుపులో పేగులు దెబ్బతిని, కడుపు ఉబ్బి పోయి మంచం నుండి క్రిందికి దిగలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. బస్తా బియ్యం ,రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు స్వయంగా ఆదే ప్రవీణ్ కుమార్ అందించారు. 40 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేశారన్నారు. యాదగిరికి హైదరాబాదులో మంచి ఆసుపత్రుల్లో ప్రభుత్వం తరఫున వైద్య సహాయం అందేటట్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వారికి మెరుగైనా వైద్య సదుపాయం సౌకర్యం అందేలా చూడాలని పార్టీ పెద్దలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈర్ల శేఖర్, వేముల దేవి దాసు, ఎడ్ల అశోక్‌తో కలిసి వెళ్లి మనోధైర్యం చెప్పారు.

హాకీ టోర్నమెంట్‌కు జిల్లా పోలీస్ క్రీడాకారులు ఎంపిక

నవతెలంగాణ-కంఠేశ్వర్



తెలంగాణ హాకీ పోలీస్ టీమ్‌కీ లావుడియా అరవింద్, (ఎల్లారెడ్డిపల్లి), బడావత్ మహిపాల్ (తూంపల్లి), లావుడియా సురేష్ (ఎల్లారెడ్డిపల్లి) ఎంపిక అయ్యారని జిల్లా హాకీ సంఘం అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి ప్రధాన కార్యదర్శులు సదామస్తుల రమణ ఆదివారం తెలిపారు. వీరు ఈ నెల 7 నుండి 15 వరకు భువనేశ్వర్ (ఒడిశా)లో నిర్వహించే అల్ ఇండియా పోలీస్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ ముగ్గురు ప్రస్తుతం నిజామాబాద్‌లోని కమిషనరేట్ ఆఫీసులో పోలీసు కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. వీరి ఎంపిక పట్ల నిజామాబాద్ జిల్లా హాకీ అసోసియేషన్ వర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరిని నిజామాబాద్ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి,ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, కోశాధికారి పింజ సురేందర్ , వైస్ ప్రెసిడెంట్ విద్య సాగర్ రెడ్డి, రిటైర్డు హాకీ కోచ్ హర్షవర్ధన్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అంజు సంయుక్త కార్యదర్శులు ఎండి జావిద్, ఎండి ఆరిఫ్, చిన్నయ్య, ఈసీ మెంబర్స్, సీనియర్ హాకీ క్రీడాకారులు అభినందించారు.



కమనీయం.. సీతారాముల కళ్యాణం

నవతెలంగాణ-విలేకరులబృందం

మోపాల్ : మండలంలోని నర్సింగ్ పల్లి గ్రామంలో గల ఇందూరు తిరుమల క్షేత్రంలో శ్రీరామ నవమి వేడుకలు. సీతారాముల కళ్యాణోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. అర్చక స్వాములు రోహిత్ కుమారాచార్య, శ్రీధర్ స్వామి, ఆలయ ధర్మకర్త నర్సింహ రెడ్డి దంపతులు, విజయసింహారెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఆలయ ఆస్థాన గాయకులు సాత్విక, నందిని తమ గానామృతంతో స్వామివారి కీర్తనలను పాడి రక్తి కట్టించారు. కార్యక్రమంలో నర్సారెడ్డి, నరాల సుధాకర్, మురళి, విజయ్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే..

శ్రీరామ నవమి, బాబా జన్మదిన సందర్భంగా మాధవనగర్ సాయిబాబా ఆలయంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి దంపతులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి ప్రత్యేక పూజలు ఆదివారం నిర్వహించారు. ఆయన వెంట ఆలయ ఈవో శ్రీరాం రవీందర్, అర్చకులు మాణిక్య శర్మ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.మండలంలోని రెంజర్ల గ్రామంలో శ్రీ కోదండరామ స్వామి వారిని మాజీ ఎమ్మెల్యే, టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు గడ్డం చిన్నారెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం రెడ్డి, సుంకరి రాజ్ కుమార్, గోపి యాదవ్ తదితరులు పాల్గొన్నారు..

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన..

మండల కేంద్రానికి సిసి రోడ్లు, సిసి డ్రైనేజీ, ప్రాథమిక సహకార సంఘం యొక్క కళ్యాణమండప మరమ్మత్తులకు, మానవ వనరుల కేంద్రానికి శంకుస్థాపన చేయటానికి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి రానున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిరెడ్డి ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. కార్యకర్తలు పెద్ద మొత్తంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ఏర్గట్ల : శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని తడపాకల్ గోదావరి నది ఒడ్డున గల సీతారామ స్వామిని, ఆర్మూర్ అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి సరళ రాణి ఆదివారం దర్శించుకున్నారు. తడపాకల్ ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు తిరునగరి కృష్ణ స్వామి ఆమెకు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆమె సీతారాముల కల్యాణం లో పాల్గొని,పూజలు నిర్వహించి,తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఇందులోభాగంగా స్థానిక ఎస్సై బి.రాము, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ పత్తి రెడ్డి ప్రకాష్, లోలపు చిన్న రెడ్డి,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్మూర్ : ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి శ్రీరామనవమి సందర్భంగా కుటుంబ సమేతంగా ఆదివారం వేడుకల్లో పాల్గొన్నారు. మండలంలోని అంకాపూర్ రామాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని సిద్దులగుట్టపై శ్రీరామ కళ్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

సిద్దుల గుట్టపై జరిగిన శ్రీరామనవమి వేడుకలలో నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి స్వామివారికి తలంబ్రాలు పట్టు వస్త్రాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో పట్టణం కాంగ్రెస్ అధ్యక్షులు , ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు పవన్ పండిట్ అయ్యప్ప శీను ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఖందేష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి పలువురు నాయకులు సన్మానించారు. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి శ్రీ అనంత ఆంజనేయ స్వామి ఆలయం నుండి హనుమాన్ భక్తులు పురవీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. పెర్కిట్ శివ పంచాయతన ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు...

మండలంలోని గోవింద్ పెట్ గ్రామ సీత రామాలయం యందు, ఆలూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శ్రీరాములవారి కళ్యాణ మహోత్సవం సంబురంగా నిర్వహించారు. గోవింద్ పెట్ గ్రామ ఆలయంలో ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండమీది జమున గంగాధర్ మాజీ ఎంపీటీసీ రాజ్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ మంచిర్యాల గోవర్ధన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

కమ్మర్‌పల్లి : వేల్పూర్ మండల కేంద్రంలోని రామాలయంలో రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రామనవమి సందర్భంగా రామాలయంలో సతీ సమేతంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ప్రశాంత్‌రెడ్డి దంపతులు అర్చకుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఆయన వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు..

మెండోర : శ్రీరామ నవమి సందర్భంగా పోచంపాడ్ కోదండ రామాలయాన్ని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సతీ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతులు సమర్పించారు. అన్నదాన సత్రంలో భక్తులకు కాసేపు ఎమ్మెల్యే భోజనం వడ్డించారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డిసిసిబి డైరెక్టర్ నాగంపేట్ శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు ఉన్నారు.

బాల్కొండ: మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలో ఆదివారం శ్రీ సీతారామ కళ్యాణ దివ్య క్షేత్రంలో శ్రీ సీతరామ కళ్యాణ మహోత్సవం వేద మంత్రోచ్చారణల మధ్య పండితులు ఘనంగా నిర్వహించారు.ఈ కల్యాణ మహోత్సవాన్ని వీక్షించడానికి వివిధ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మండలకేంద్రంలో..

మండల కేంద్రంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పోచమ్మగల్లిలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం పూర్ణాహుతి, హారతి, తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

డిచ్‌పల్లి : జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఖిల్లా డిచ్పల్లి రామాలయంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా శ్రీరాముని జననం, అనంతరం ఆలయ ప్రధాన ఆర్చకులు సుమీత్ శర్మ దేశ్పాండే ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి వినోదిని దంపతులు స్వామి వారి కల్యాణవేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త గజవాడ రాందాసు గుప్తా కుటుంబ సభ్యులు స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. పలువురు భక్తులు సీతారాములకు పుస్తేలు, మట్టేలు కానుక సమర్పించారు. కల్యాణం ముగిసిన తర్వాత ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ... ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటి చైర్మన్ శాంతయ్య, నాయకులు సాయిరెడ్డి, గంగాధర్, శ్రీనివాస్, వీడీసీ సభ్యులు సాయిలు, సుదర్శన్, మహేందర్ రెడ్డి, రాములు, నర్సారెడ్డి, లక్ష్మన్, నర్సింలు, ఎజీ దాస్ గ్రామస్తులు పాల్గొన్నారు. జిల్లా నలుమూల నుంచి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు దాదాపు పదివేల మంది భక్తులు ఆలయాన్ని సందర్శించుకొన్నారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు.

భీంగల్ రూరల్: భీంగల్ మండలంలోని జాగిర్యాల గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. హనుమాన్ భక్తులు, వీడీసీ సభ్యులు సీతమ్మను పల్లకిలో గ్రామంలో నుండి ఊరేగింపుగా శ్రీరాముల ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం శ్రీరాముల కళ్యాణాన్ని ఆలయ అర్చకులు రామకృష్ణ, వంశీకృష్ణ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, విడిసి సభ్యులు సురేష్, చిన్న రాజన్న, రామ్ చందర్, సుదర్శన్ గౌడ్, రవి, పర్వయ్య, రాజమల్లు, మహమ్మద్, గంగాధర్, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఆర్మూర్: పూజ చేస్తున్న ఎమ్మెల్యే పైడిరాకేష్ దంపతులు



మెండోర: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి దంపతులు



డిచ్‌పల్లి: పూజలు చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే దంపతులు

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

నవతెలంగాణ-భీంగల్ రూరల్



మృతి చెందిన మహేష్

ఉపాధి కోసం మోర్తాడ్ గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తి బైక్ అదుపు తప్పి గాయపడ్డ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై జి మహేష్ వివరాల ప్రకారం.. గండికోట మహేష్ (42) 15 సంవత్సరాల క్రితం భార్య భర్తల మధ్య గొడవలు కావడంతో పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుండి ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్న భీంగల్ నుండి మోర్తాడ్ వెళ్తుండగా జాగిర్యాల బీటీ రోడ్డు మీద ప్రమాదవశాత్తు బైక్ పైనుండి పడగా తలకు బలమైన గాయంఅయింది. దీంతో 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి మహేష్ తెలిపారు.

వెదురు బొంగుల దుకాణంలో అగ్ని ప్రమాదం

- సుమారు రూ.6 లక్షలు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడి ఆవేదన

నవతెలంగాణ-కంఠేశ్వర్



నగరంలోని వర్ని చౌరస్తాలో గల వెదురు బొంగుల దుకాణంలో ఆదివారం అగ్ని ప్రమాదం ప్రమాదవశాత్తు చోటు చేసుకుంది. దీంతో దుకాణంలోని కట్టెలు, వెదురు బొంగులు కాలిపోయాయి. స్థానికులు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. సుమారు రూ. ఆరు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు అజయ్ ఆవేదన వ్యక్తం చేశాడు. రెండు రోజుల వ్యవధిలో నగరంలో ఇది రెండో అగ్ని ప్రమాదం కావడం గమనార్హం. సంఘటన స్థలాన్ని ఐదవ టౌన్ ఎస్సై గంగాధర్ పరిశీలించారు.

మతోన్మాద శక్తులను తిప్పికొడుదాం

నవతెలంగాణ-ఆర్మూర్

దేశంలో ప్రమాదకరంగా మారిన మతోన్మాద శక్తులను త్రిప్పికొడ్తం అని,ప్రజల్ని మత ఘర్షణలకు పురికొలపుతున్న మతోన్మాద కుట్రలను వ్యతిరేకిద్దాం అనసీపీఐ(ఎం.ఎల్.) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ అన్నారు. ఆదివారం సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో కుమార్ నారాయణ భవనంలో డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్. రమేష్ అధ్యక్షతన ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని సమస్యలను పక్కకు పెట్టి బిజెపి ప్రధాని మోడీ మత ఘర్షణలు, మత ప్రచారాలు పెద్ద ఎత్తున సృష్టిస్తున్నారన్నారు. ఈనాడు మొత్తం అన్ని రకాల సమస్యలను పక్కకు పెట్టి యుద్ధ ప్రతిపాదికన మతంను తన ఎజెండాగా తీసుకొని అమలుకు పూనుకుంటున్నారన్నారు. పాత చట్టాల రద్దు చేసి కొత్త చట్టాలు తెచ్చి మైనార్టీ వర్గాలపై దాడి చేస్తున్నారని దుయ్యబట్టారు. సీపీఐ(ఎం.ఎల్.) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి బి. దేవారం మాట్లాడుతూ.. మతోన్మాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం నిర్మించాలన్నారు. టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఎం. ముత్తెన్న, ఏఐయుకేఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్. సురేష్, జిల్లా నాయకులు బి. కిషన్ మాట్లాడారు. పార్టీ జిల్లా, డివిజన్, మండల నాయకులు రాజేశ్వర్, వి. సత్తెవ్వ, జి. కిషన్, ఆర్. దామోదర్, ఏపి. గంగాధర్, యూ. రాజన్న, ఠాగూర్, జి. అరవింద్, ఈ. రమేష్, యస్. దుర్గా ప్రసాద్ ఎల్. అనిల్ కుమార్, జి. పద్మ, ఎం. సునీత, ఎం. డి. అనిస్, ఎస్. కిశోర్, ఎం. డి. నశీర్, వి. బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను సాధిద్దాం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్
- బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మహనీయుల ఆశయాలను సాధిద్దమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ అన్నారు. ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ రాజకీయంగా ఎదురులేని శక్తిగా ఎదిగిందంటే ఎందరో మహనీయులత్యాగ ఫలమే అన్నారు. 2 సీట్లతో బీజేపీ ప్రస్థానం మొదలై ఈరోజు మూడోసారి ఏకగ్రీవంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు వరకు ఎదిగిందన్నారు. వికాసిత్ భారత్ కోసం అందరం పని చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణశాఖ ఆధ్వర్యంలో పతకావిష్కరణ నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు మందుల బాలు అధ్యక్షతన శివాజీ చౌక్ వద్ద జరిగిన పథకావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పటణంలోని 36 వార్డులలో కైవసం చేసుకుని వచ్చే సంవత్సరం భారతీయ జనతా పార్టీ నాయకులే చైర్మన్‌గా ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి జస్సు అనిల్, కలికోట గంగాధర్, ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, మాజీ కౌన్సిలర్ ఆకుల శీను, పాన్ శీను, ఆకుల రాజు, బోట్ల విజయ్, మందుల వీరభద్రి, పోశెట్టి, పోల్కం వేణు, విజయ్ ఆనంద్, షికారి శీను, తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్ చౌరస్తాలో..

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చౌరస్తాయందు బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పాలెపురాజు ఆధ్వర్యంలో పథకావిష్కరణ కార్యక్రమం నిర్వహించినారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్ : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు గడ్డం సంతోష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు నాయకుడు పద్మ-కిషన్, పార్టీ నాయకులు ముస్కు నర్సయ్య, పల్లికొండ గోపీనాథ్, మెడికల్ విక్రమ్, సాగర్, మ్యాక నర్సయ్య, కల్లు స్వామి, భూమేశ్వర్, మజిత్, రాములు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బిజెపి పార్టీ గద్దె వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దిగ్విజయంగా భారతీయ జనతా పార్టీ 45 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. మండల ప్రజలకు పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు చింత ప్రవీణ్, రేంజర్ల గంగాధర్, దశరథ్, బలరాం, చారి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు ఓటు హక్కు కల్పించాలి

- మండల పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

జిల్లా పద్మశాలి విద్యార్థి వసతి గృహం ఎన్నికల్లో జిల్లాలోని అన్ని గ్రామాలకు ఓటు హక్కు కల్పించాలని మండల పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యులు కోరారు. ఆదివారం మండల పద్మశాలి సంఘం తరఫున నిజామాబాద్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు బిజ్జు దత్తాత్రి ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు చింత తిరుపతి మాట్లాడుతూ.. త్వరలో జిల్లా పద్మశాలి విద్యార్థి వసతి గృహం ఎన్నికల నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రతి గ్రామానికి ఒక ఓటు హక్కు కల్పిస్తూ, అన్ని గ్రామాల ఓట్లతో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. మండలంలో 11 పద్మశాలి గ్రామ సంఘాలు ఉన్నందున మండలానికి 11 ఓట్ల హక్కులు కేటాయించాలని విన్నవించినట్టు తెలిపారు. ఎన్నికల్లో మండలం నుంచి పోటీ చేసేందుకు పలువురు పద్మశాలి సంఘ సభ్యులు ఆసక్తిగా ఉన్నారన్నారు. పాత నిబంధనాల పేరుతో కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా మన నిబంధనలు కూడా మార్పులు, చేర్పులు చేసి జిల్లాలోని అన్ని గ్రామాలకు ఓటు హక్కు, పోటీ చేసే హక్కు కల్పించాలన్నారు. ఈ విషయంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షునితోపాటు కార్యవర్గ సభ్యులు సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు రాజుల కృష్ణ మురళి, కోశాధికారి పోతు ధరణి కుమార్, గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షులు చింత హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

టిపిసిసిని కలిసిన ఉర్దూ అకాడమీ చైర్మన్, నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ ఆదివారం నిజామాబాద్ జిల్లాకు వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలిసి స్వాగతం పలికారు. కలిసిన వారిలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, గంగారెడ్డి, సుమన్, తదితరులు ఉన్నారు.

పేదలు సన్న బియ్యం తినాలన్నదే ధ్యేయం

- కాంగ్రెస్ నాయకులు రాజేందర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పేదలు సన్న బియ్యం తినాలన్నదే కాంగ్రెస్ ధ్యేయమని నారాయణపేట కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని నారాయణపేట గ్రామంలో రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. సన్న బియ్యం అందించినందుకు సీఎం, నిజాంబాద్ రూరల్ ఎమ్మెల్యేలకు గ్రామ పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

హిమోఫిలియాకు నివారణే మార్గం

- బాధితులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన



కరపత్రాలను ఆవిష్కరించిన పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని మారుతి నగర్‌లోని స్నేహ సొసైటీలో హిమోఫిలియా సొసైటీ నిజామాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో హిమోఫిలియా బాధితులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్హిబిట్టర్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ నీలి రామచందర్ పిల్లల వైద్య నిపుణులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో విజయానందరావు ఆధ్వర్యంలో తోటి హిమోపిలియా బాధితులకు అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. హిమోపిలియా పుట్టుకతో, జన్యు లోపం వల్ల వచ్చే వ్యాధి అని, దీనికి స్క్రీనింగ్, కౌన్సిలింగ్ అవసరమని, ప్రతి ఒక్కరి బ్లడ్ ప్రొఫైల్ కూడా తప్పనిసరిగా చేయించుకోవాలని ఆయన సూచించారు. హిమోఫిలియా ఒకసారి వచ్చిందంటే మనం చేయగలిగింది ఏమి లేదని, దీనిని నయం చేయలేమని నివారణ ఒక్కటే మార్గమని ఆయన సూచించారు. ప్రభుత్వం ముందుకు వచ్చి హిమోఫిలియా బాధితుల్లో మనోధైర్యాన్ని కల్పించి నిరంతరంగా ఫ్యాక్టర్స్ అందించాలని ఆయన కోరారు. వారి కొరకు వసతులు పెంపొందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన డాక్టర్ రవీంద్రనాథ్ సూరి మాట్లాడుతూ.. హిమోఫిలియా 150 సంవత్సరాల క్రితమే రాజకుమారులకు ఉండేదని, వారు ఎందుకు చనిపోతున్నారో తెలిసేది కాదని, కాల క్రమేన వారు హిమోపేలియాతో చనిపోతున్నారని తెలుసుకున్నారని చెప్పారు. హిమోఫిలియా ఎలా వస్తుంది.. ఎలా నివారించాలి అనే అంశాలపై హిమఫిలియా బాధితులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. హిమోఫిలియోపై పేరెంట్స్ కే కాకుండా టీచర్స్ కూడా అవగాహన ఉండాలని పిల్లలు స్కూల్లో ఆటలు ఆడేటప్పుడు ఏదైనా దెబ్బలు తగిలితే రక్తస్రావం నివారించడానికి ఏమి చికిత్స చేయాలో వారికి అవగాహన ఉండాలని ఆయన తెలిపారు. మందులు మాత్రమే హిమోఫీలియా సమస్యను పరిష్కరించవని సమాజ సహకారం కూడా దీనికి సహకరించాలని ఆయన తెలిపారు హిమోఫిలియను ఒక వ్యాధిగా భావించకుండా భయపడకుండా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమానికి హిమోఫిలియా సొసైటీ నిజామాబాద్ చాప్టర్ అధ్యక్షులు దాసరి విజయనందరావు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో ఇంటస్ ఫౌండేషన్ ద్వారా హిమోపిలియా బాధితులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయల విలువైన ఫ్యాక్టర్స్ ని అందించారు. హిమోపిలియ బాధితులకు ఇన్హిబిటర్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయానంద రావు రాసిన హిమోఫిలియా పై కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య ఇంటాస్ ఫౌండేషన్ ప్రతినిధి కరుణాకర్ బర్దిపూర్ పిఎస్సి చైర్మన్ రామకృష్ణ, హిమోపిలియా సొసైటీ నిజామాబాద్ చాప్టర్ కోశాధికారి మహమ్మద్ ఎజాజ్, జనరల్ సెక్రెటరీ గంగారం, వైస్ ప్రెసిడెంట్ అంబరీష్ హిమోపిలియా బాధితులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్



మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం నాయకుడు ఆకుల సంగయ్యను ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్ ఆదివారం పరామర్శించారు. ఆకుల సంగయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు నేరుగా ఆయన ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అధైర్యపడవద్దు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మెరుగైన వైద్య చికిత్స చేయిస్తానని ఆయన హామీనిచ్చారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, నర్సింలు, బాలచందు, సాయిరాం, యూసుఫ్, పర్వయ్య, నరేష్, మల్లేశం, వివేకానంద తదితరులున్నారు.

చందాలు చేసి బోరు వేసుకున్న గ్రామస్తులు

నవతెలంగాణ-సదాశివనగర్



మండలంలోని లింగంపల్లి గ్రామస్తులు చందాలు వేసుకుని బోర్ వేసుకున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి రూ.500 జమ చేసుకొని తాగునీటి కోసం బోరు వేసుకున్నట్లు ఆదివారం పేర్కొన్నారు. అధికారులకు ఎన్నిసార్లు అడిగినా బోరు వేయించలేదని దాంతో తామే డబ్బులు పోగుచేసుకుని రెండు లక్షల 50 వేలు ఖర్చు చేసి బోరు మోటర్ వేయించుకున్నట్లు వివరించారు. అలాగే గ్రామంలోని పురాతన బావిని బాగు చేసుకోవడానికి 30,000 ఖర్చు అయినట్టు తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే స్పందించి బోర్ బావికి మంచినీటికి ఖర్చు చేసిన డబ్బులు మొత్తం 2లక్షల 80వేలు ఇప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

- ఆలయాల వద్ద అన్నదానం
- లింగంపేట్‌లో ఎడ్లబండ్ల ప్రదర్శన

నవతెలంగాణ-విలేకరుల బృందం

లింగంపేట్ : శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం సీతారామ కళ్యాణ మహెూత్సవలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద అన్నదానం చేపట్టారు. సాయంత్రం ఎడ్లబండ్లను అలంకరించి ఆలయాల చుట్టూ ఐదు సార్లు ప్రదర్శన నిర్వహించారు. రాత్రి వేళలో పల్లకి సేవ నిర్వహించారు.

ఎడపల్లి : మండలంలోని పోచారం గ్రామంలో గల శ్రీ సీతారాముల కళ్యాణ మహెూత్సవాన్ని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళ్ పహాడ్ గ్రామంలో గల హనుమాన్ స్వాముల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం మహెూత్సవాన్ని చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను చేశారు. ఏఆర్‌పిక్యాంప్, జైతాపూర్, పోచారం గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సదాశివనగర్ : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో ఆదివారం శ్రీ రామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని భక్తుల మధ్యన నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూజారి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు సుఖ సంతోషాలతో ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

దోమకొండ : మండల కేంద్రంలోని శివరాం మందిరం ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముని కళ్యాణం వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీతారాముని కళ్యాణం వేడుకలు వేద పండితులు మంత్రోచ్చారణలతో చేపట్టి.. స్వామి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వైభవంగా కళ్యాణం వేడుకలు నిర్వహించిన అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తిరుమల గౌడ్, మాజీ సర్పంచ్ అంజలి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు నర్సారెడ్డి, అబ్రబోయిన స్వామి, పెద్దిరెడ్డి సిద్ధారెడ్డి, అర్చకులు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని శివరాం మందిరం ఆలయంలో, శ్రీరామ నవమి సందర్భంగా సీతా రాముని కళ్యాణం వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

గాంధారి : మండల కేంద్రంతో పాటు మండలంలోని గౌరారం, రామలక్ష్మణ్‌పల్లి సీతారామాంజనేయ ఆలయాల్లో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. రామలక్ష్మణ్‌పల్లి సీతారామాంజనేయ ఆలయంలో సీతారాముల కళ్యాణంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సీతారామాంజనేయ ఆలయాల్లో సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది. తిప్పారం తండాలో గల రామాలయంలో ఎమ్మెల్యే సందర్శించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తాండాలో నీటి వసతి కల్పిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్రామ పెద్దలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంలో గల కోదండ రామాలయంతో పాటు తాండూర్ గ్రామంలో గల త్రిలింగ రామేశ్వరాలయంలో సీతారాముల కళ్యాణ మహెూత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకి సేవను గ్రామాల్లో గల వీధుల్లో ఊరేగించి రామాలయానికి చేరుకొని కళ్యాణ మహెూత్సవాన్ని వేద పండితుల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలోని రామారెడ్డి, మద్దికుంట, రెడ్డిపేట్, మోషన్‌పూర్‌తో పాటు వివిధ గ్రామాల్లో శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామారెడ్డిలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో, మద్దికుంటలోని పైగా రాయి వద్ద సీతారాముల కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సీతారాముల కళ్యాణోత్సవానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామాల్లో మాలాదారులు ర్యాలీలు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవానికి మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి రూ.5010 అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్ : పట్టణ కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ మహెూత్సవాన్ని నగరేశ్వర ఆలయంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పురాం రాజమౌళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల కోసం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు సీతారాముల విగ్రహాలను పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అలాగే మండలంలోని జంగంపల్లి, సిద్ధ రామేశ్వరనగర్, పెద్దమల్లారెడ్డి, రామేశ్వర్‌పల్లి, బస్వాపూర్ ఆయా గ్రామాలలో సీతారాముల కళ్యాణ మహెూత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మద్నూర్ : మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రామ్ పటేల్ దంపతులు కళ్యాణ ఉత్సవ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని భారీ సంఖ్యలో భక్తులు బైక్ ర్యాలీ శోభాయాత్ర చేపట్టారు. మండల కేంద్రంలోని శ్రీరామచంద్ర స్వామి ఆలయం నుంచి రాష్ట్ర సరిహద్దులోని సలాబత్పూర్ ఆంజనేయస్వామి టెంపుల్ వరకు బైక్ ర్యాలీ శోభయాత్ర చేపట్టారు.

పోతంగల్ : మండలంలోని పలు గ్రామాలలో శ్రీ రామ ఆలయాలలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రామమందిరంలో పండిత ప్రవర వేదశాస్త్ర సంపన్న శ్రీ గణేశ్వర శాస్త్రి ద్రావిడ వారణాసిగారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కామారెడ్డి : జిల్లా వ్యాప్తంగా సీతారాముల కళ్యాణం మహెూత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎన్జీవోఎస్ కాలనీలో సీత రాముల కళ్యాణం చేపట్టారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, కమిటీ మెంబర్స్ సిద్ధారెడ్డి, ఎస్.శ్రీనివాస్, శ్రీకాంత్, పంపరి శ్రీనివాస్, దామోదర్, లక్ష్మి నారాయణ, నగేష్ నాయక్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట్‌లో..

మండల కేంద్రంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహెూత్సవంలో భాగంగా కళ్యాణం పూర్తి కాగానే బట్టుపల్లి మహేశ్వరి, రమేష్ గౌడ్‌ల కూతురు కుమారి ప్రదీప్తి సాయి చేసిన కూచిపూడి నృత్యం పలువురిని ఆకర్షించింది.

రెంజల్ : మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని సీతారాముల కళ్యాణోత్సవ శోభయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేపట్టారు.


ఎడపల్లి: స్వామివారిని ఉయ్యాలలో ఊపుతున్న భక్తులు


దోమకొండ: కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


నాగిరెడ్డిపేట్: పూజలు చేస్తున్న భక్తులు


రామారెడ్డి: ర్యాలీ నిర్వహిస్తున్న స్వాములు


భిక్కనూర్: పూజలు చేస్తున్న పలువురు

బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

గాంధారి : మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని మండలాధ్యక్షులు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తా వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి నేరాల ఆంజనేయులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పోతంగల్ కిషన్ రావు, మండలాధ్యక్షులు మధుసూదన్‌రావు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, మండల ఉపాధ్యక్షులు హుస్సేన్, మండల అధికార ప్రతినిధి సతీష్, సంజీవులు, రవి, గంగరాజయ్య, కృష్ణారెడ్డి, బిజెపి బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ 45వ ఆవి ర్భావ దినోత్సవంలో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలను ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు స్వీట్లు పంచుకొని ఒకరినొక రు ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మాజీ పార్లమెంటు సభ్యులు బీబీపాటిల్, మాజీ ఎమ్మెల్యే సౌధాగర్ గంగారాం, స్థానిక నాయకులు రాము సెట్, అశోక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దత్తు రాములు, మండల ప్రధాన కార్యదర్శులు రామచందర్, నవీన్ కుమార్, విష్ణు, సుభాష్, ఓబిసి మండలాధ్యక్షులు అంద్యాల ఉదేశ్, కిసాన్ సంగ్ మండలాధ్యక్షులు చేపూరి పోశెట్టి, మండల బూత్ అధ్యక్షులు భీమయ్య, స్వామిగౌడ్. సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్ : పట్టణ కేంద్రంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని మండల అధ్య క్షులు రమేష్ బిజెపి పార్టీ జెండాను ఎగురవేసి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బసవరెడ్డి, మండ ల ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పైడి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండలాధ్యక్షులు సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరిరామ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హెూటల్ శ్రీను, వెంకట్రావు, ముదాం దత్తాత్రేయ, స్వామి రెడ్డి, యాదగిరి, ఆయా గ్రామాల బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అరుణాతార ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు తప్ప తుకారాం, నాయకులు కృష్ణ పటేల్, పండిత్ రావు పటేల్, బాలకిషన్, సంతోష్, రమేష్ దేశాయ్, సుభాష్, అంజయ్య, అజయ్ తమ్మే వార్, తుకారం, తదితరులు పాల్గొన్నారు.


గాంధారి : జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

రాజ్యాంగాన్ని పరిరక్షించడమే ధ్యేయం


నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్ర చేపడుతుందని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు అన్నారు. ఆదివారం సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన సందర్భంగా మద్నూర్ యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు హనుమంతు యాదవ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యేతో జైబాపు, జైభీమ్ పోస్టర్లను ఆవిష్కరించారు. పాదయాత్ర ద్వారా గ్రామ గ్రామాన ప్రజల్లోకి వెళ్లాలని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని ప్రజలంతా ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మండల నాయకులతో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలో పాల్గొన్న విద్యాదాత సుభాష్‌రెడ్డి


విద్యాదాతను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

నూతన పాల్వంచ మండలంలోని పరిదిపేట్ గ్రామంలో శ్రీ రామ నవమి సందర్భంగా ముఖ్యఅతిథిగా సీతారామాంజనేయు స్వామి ఆలయంలో జరిగే ప్రత్యేక పూజ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా బిబిపేట్ మండలం జనగామ గ్రామానికి చెందిన విద్యా దాత సుభాష్ రెడ్డి ఆదివారం హాజరయ్యారు. ప్రముఖ పరిశ్రామికవేత్త, విద్యాదాత తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డికి పరిధిపేట గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీరామనవమి సందర్భంగా సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలందరూ పాడి పంటలతో, విద్యాబుద్ధులు కలిగి సుఖశాంతులతో ఉండాలని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మెమెంటో అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చుక్కాపూర్ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి, జనగామ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మట్ట శ్రీనివాస్, సిద్ధరామిరెడ్డి, చాట్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

సలాబత్‌పూర్ ఆలయాన్ని తీర్చిదిద్దుతా

- ఆలయాభివృద్ధికి రూ.70 కోట్ల నిధులు మంజూరు
- జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయానికి రాష్ట్రంలోనే గుర్తింపు వచ్చేవిధంగా తీర్చిదిద్దుతానని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు అన్నారు. ఆలయ అభివృద్ధికి రూ.70 కోట్ల నిధులు మంజూరు చేయించినట్టు తెలిపారు. వెనుకబడ్డ జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని, ప్రస్తుతం ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులకు భారీగా నిధులు మంజూరు చేయించినట్టు వివరించారు. సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తిచేయడంలో గత పాలకులు, అధికారులు పూర్తిగా మరిచిపోయారని వివరించారు. అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్టు నిర్మింపజేయడానికి ప్రస్తుత బడ్జెట్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రూ.42 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. లెండి ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఇరురాష్ట్రాల అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ పనులు వేగవంతం చేయడానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నానని సలాబత్‌పూర్ ఆంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీ ఆలయ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంత రావు అన్నారు. మూడు రాష్ట్రా లకు పూర్తి ఆ సరిహద్దులో గల జుక్కల్ అభివృద్ధి తమ ధ్యేయమని, ఈ ఆలయాన్ని మూడు రాష్ట్రాల భక్తుల్లో ప్రసిద్ధి గాంచే విధంగా భక్తుల సహాయార్థం 70 కోట్ల నిధులతో అన్ని హంగులతో తీర్చిదిద్ది ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యేకు నూతన పాలకవర్గం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే నూతన కమిటీ చైర్మన్ రామ్ పటేల్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీధర్, ఆలయ అధికారులు, పాలకవర్గం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, పిట్లం తదితర మండలాలకు చెందిన ముఖ్య నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతారావు.. ఎమ్మెల్యేను కలిసిన పలువురు

హనుమాన్ ఆలయ పున:నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని హంగర్గ గ్రామవాసి ఆలయ కమిటీ అధ్యక్షులు నీరడి గంగాధర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామనవమి పర్వదినాన శ్రీ హనుమాన్ ఆలయ పున్ణనిర్మాణానికి తమవంతుగా రూ.51,111 నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులపై చిన్నచూపు తగదు

నవతెలంగాణ-తాడ్వాయి

ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులపై విద్యాశాఖ అధికారుల చిన్నచూ పు తగదని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యా య సంఘం జిల్లా అధ్యక్షులు, రాములు, ప్రధాన కార్యదర్శి కొల్లూరి స్వామి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవ తరగతి 2025 సంవత్సరంలో మూల్యాంకనంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మాత్రమే డ్యూటీలు వేయాలని, జిల్లాలోని బిచ్కుంద మండలంలో 35 మంది ఉపాధ్యాయులకు డ్యూటీలు వేశారని పేర్కొన్నారు. ఒకే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇరువురికి డ్యూటీలు వేయడం బాన్సువాడ మండలంలో 42 మంది గాంధారిలో 30 మందికి డ్యూటీ వేశారని ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో విధులు చేపట్టి తిరిగి సివిల్ అసిస్టెంట్‌గా డ్యూటీలు వేయడం వల్ల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు 20 రోజులపాటు పాఠశాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని తెలిపారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులపై విద్యాశాఖ అధికారులు కక్షగట్టి ప్రాథమిక విద్యపై నిర్లక్ష్యం చేస్తున్నారని ఇలాంటి కక్షపూరిత వైఖరిని మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నల్లూర్ గ్రామంలో ఎస్ఐ వి.రజినీకాంత్ చేతులమీదుగా చలివేంద్రంను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లూర్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు నారాయణ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన జంగం మమత జ్ఞాపకార్థం చలివేంద్రంను ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామభివృద్ధి కమిటీ అధ్యక్షులు నారాయణ, రమణ, గంగాధర్, నవీన్, గ్రామ పెద్దలు, యువకులు, మమత కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పిసిసి అధ్యక్షుని సమక్షంలో పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్ పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు. సుంకెట రవితో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా కేకును కట్ చేయించి తినిపించారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గణితమేధ రాష్ట్రస్థాయిలో విశ్వ వికాస్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్వామెద ఎడ్యుకేషనల్ సర్వీసెస్ వారు గణితమేధ రాష్ట్రస్థాయి పోటీలను మార్చి 15న నిర్వహించారు. ఈ పోటీల్లో విశ్వ వికాస్ విద్యార్థులు గెలపొందారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కార్యాలయంలో గెలుపొందిన విశ్వ వికాస్ హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు అందించి విద్యార్థులను ప్రశంసించారు.రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించిన 9 తరగతి యశ్వంత్‌కు నగదు, బహుమతి, బంగారు పతకం, 2వ స్థానం సాధించిన 8తరగతి జీ.సాత్విక నగదు, బహుమతి, వెండి పతకం, 2వ స్థానంలో 3తరగతి జి.అకిరాకు నగదు, బహుమతి, వెండి పతకం, 3వ స్థానంలో 5తరగతి జీ.సహస్ర నగదు, బహుమతి, కాంస్య పతకం అందుకున్నారని పాఠశాల యాజమాన్యం తెలిపారు. తమ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవడం గర్వకారణంగా ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ సుస్మిత, కరెస్పాండంట్ అప్పారావు హర్షం వ్యక్తం చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- కోనాపూర్ సింగిల్ విండో చైర్మన్ రమేష్ రెడ్డి


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సింగిల్‌విండో చైర్మన్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోనాపూర్ సింగిల్ విండో చైర్మన్ బడాల రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం కోనాపూర్‌లో స్థానిక సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం విక్రయించాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, బి గ్రేడ్ ధాన్యానికి రూ. 2300 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రతి రైతు వరికి 17 శాతం మ్యాచర్ వచ్చేటట్టు చూడాలని రైతులను కోరారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ దయ్య దేవయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ చిన్నారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, సొసైటీ కార్యదర్శి నాగరాజు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షులు

నవతెలంగాణ -ధర్పల్లి

రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి లాభాలు ఆర్జించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ అన్నారు . ఆదివారం అయన మండలంలోని గుడి తండా సీతాయిపేట్, గోవిందుపల్లి , దుబ్బాక గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సన్నాలకు బోనస్ అందిస్తుందన్నారు. సెంటర్లలో గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, లారీల కొరతలేకుండా పర్యవేక్షించేందుకు సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కల్గకుండా, కాంటాలు సజావుగా చేసేందుకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో చైర్మెన్ చెలిమెల మల్లికార్జున్, కార్యదర్శి సంతోష్ రెడ్డి, డైరెక్టర్లు నౌసి, పోతరాజు, ప్రమీల, సాలేహ బేగం, పోతన్న, గణేష్, గోవింద్, శ్రీనివాస్, గంగయ్య, కోతి శేఖర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ప్రతాప్ గౌడ్, రైతులు, గ్రామాభివృద్ధి సభ్యులు పాల్గొన్నారు.

స్వీపర్లు, స్కావెంజర్లకు మొదటి వారంలో వేతనాలు ఇవ్వాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్వీపర్లు, స్కావెంజర్లకు ప్రతినెల మొదటి వారంలో వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం జిల్లా ఉపాధ్యక్షులు టి.చక్రపాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్లకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా వేతనాలు నిర్ణయించు బడ్జెట్ కేటాయించి ప్రధానోపాధ్యాయులు, పొదుపు మహిళా సంఘం ఖాతాలో జమ చేస్తుందన్నారు. అధికారులు ఇష్టా రీతిన వేతనాలు చెల్లించడం సరైన పద్ధతి కాదన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎల్లవేళలా పోరాటానికి సిద్ధంగా ఉంటామని అన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని 18 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా వై.ఓమయ్య, అధ్యక్షులుగా టీ.చక్రపాణి, ఉపాధ్యక్షులుగా రాధా, స్రవంతి, ప్రధాన కార్యదర్శిగా వసంత, కార్యదర్శిగా సోఫియా, ఉదయతోపాటు 13 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఏప్రిల్‌లోనే అకాడమిక్ ఇయర్ ప్రారంభం?

- పట్టింపులేని విద్యాశాఖ అధికారులు
- ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటారట?

విద్యాసంవత్సరం జూన్‌లో ప్రారంభం కావడం ఏప్రిల్‌లో ముగియడం అందరికీ తెలిసిందే కానీ ఇప్పుడు నిజామాబాద్ జిల్లాలో పలు ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యాసంవత్సరం మార్చిలో ముగిసి ఏప్రిల్‌లో ప్రారంభమవుతోంది. అయినా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తును వీడడంలేదు. ఇదంతా చూస్తే ప్రైవేట్ పాఠశాలలను పర్యవేక్షణ చేయడంలో విఫలం అవుతున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. అందులోనూ ఫిర్యాదు వస్తే కానీ ఏ విద్యాసంస్థకు వెళ్లం అని నిర్మోహమాటంగా విద్యాశాఖ అధికారులు చెప్పడంపై విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను తనిఖీలు చేసి నూతన విద్యాసంవత్సరం ప్రారంభించిన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ముందస్తుగానే విద్యాబోధన..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం జూన్ 12 నుండి ఏప్రిల్ 24 వరకు పాఠశాలలు కొనసాగుతాయి. ఈఏడాది కాలంలో ఒక్కో తరగతికి పాఠ్యాంశాలు నేర్పడానికి పీరియడ్ల ప్రకారం.. సబ్జెక్టులు చెబుతారు. కానీ కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు మాత్రం ప్రయిమరీ విద్యార్థులకు మార్చి నెలలోనే పరీక్షలు పూర్తి చేసేస్తున్నాయి. ఏప్రిల్ మొదటివారం నుండే రాబోయే సంవత్సరానికి సంబంధించిన పుస్తకాలు కొనుగోలు చేయాలని, దానికి సంబంధించిన తరగతులు నిర్వహిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది.

ఇష్టారాజ్యంగా బోధన..

అసలు ఏ పాఠశాలలోనూ ప్రైవేట్, కార్పొరేట్‌లో విద్యార్థులకు సక్రమంగా తరగతులను బోధించడంలేదని, వారి ఇష్టానుసారంగా పాఠ్యాంశాలను పూర్తిచేసేసి, ఈ విద్యా సంవత్సరం పూర్తయింది, తర్వాత సంవత్సరానికి తరగతులకు విద్యార్థులను ప్రమోట్ చేస్తున్నారుని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా తరగతులను ప్రమోట్ చేయడం కూడా నిబంధనలకు విరుద్ధం. విద్యార్థులకు బేసిక్ పాయింట్స్ రీడింగ్, రైటింగ్, డిక్టేషన్ వంటివి రాకుండానే ముందస్తు తరగతులకు ప్రమోట్ చేయడం విడ్డూరంగా ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్న విద్యాశాఖ అధికారులు కండ్లు మూసుకున్నారా.. అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మేల్కొని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల పైన పర్యవేక్షణ చేయాలని కోరుతున్నారు.

Forwarded
Dear Parents,
We are happy to announce you that *THE NEW ACADEMIC YEAR (2025-26) FOR PRIMARY WILL BE STARTED FROM (02.04.2025).*
So your children will be promoted to *NEXT CLASS AND NEXT CLASS SYLLABUS WILL BE BEGIN FROM TOMORROW ONWARDS*

NOTE. :: Books are available in store , So plz do purchase the books of the academic year (2025-26)

ఓప్రయివేటు విద్యాసంస్థనుండి వచ్చిన మెసేజ్

యాజమాన్యాలకు విద్యాశాఖాధికారుల వత్తాసు..

ఒకవేళ అనుకోకుండా విద్యాశాఖ అధికారులు ఏ ప్రైవేట్ పాఠశాల, కార్పొరేట్ పాఠశాలకు వెళ్లినా ప్రైవేటు పాఠశాలల సంఘాలు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు తొత్తులుగా పనిచేస్తున్నారని పలు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యాశాఖ అధికారుల్లో ఏమాత్రం చలనం లేదంటే వారికి ఏ లెక్కలో ముడుపులందుతున్నాయో చెప్పనవసరం లేదని విద్యార్థి సంఘాల నాయకులు చేస్తున్న ఆరోపణలకు బలం చేకూరుస్తున్నట్టు ఉన్నాయి.

రామాలయానికి సీఎంను తీసుకువస్తా

రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

చారిత్మాతక డిచ్‌పల్లి ఖిల్లా రామాలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తీసుకువస్తానని, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి చెప్పారు. ఆదివారం శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి హజరైన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రూరల్ నియోజక వర్గానికి ఎంతో ప్రాముఖ్యత ఉన్న డిచ్పల్లి రామాలయాన్ని టూరిజం హబ్‌గా మార్చడానికి గాను ఇటీవల శాసనసభలో మాట్లాడినట్లు పేర్కొన్నారు. రూరల్‌కు మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ శంఖుస్థాపన కార్యక్రమానికి సీఎం రెవంత్రెడ్డి వస్తారని, అదే సమయంలో సీఎంను రామాలయానికి తీసుకువస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎకో టూరిజంలో భాగంగా డిచ్పల్లి రామాలయం వద్ద పార్క్ ఏర్పాటు, పక్కన చెరువులో బోటింగ్, కింద నుంచి గుట్టపై సర్వీస్‌రోడ్డు సౌకర్యం కల్పించడానికి టూరిజం శాఖకు ప్రతిపాధనలు ప్రభుత్వానికి పంపించామని ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్యే వెంట మండలాధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, నాయ కులు శ్రీనివాస్, సుదర్శన్, చైర్మన్ శాంతయ్య పాల్గొన్నారు.

ఈ సంవత్సరం ఎన్నో విజయాలు సాధించాం

- లిల్లీపుట్ పాఠశాలలో అకాడమిక్ సక్సెస్ మీట్



ద్యాన్సులు చేస్తున్న చిన్నారులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో అకాడమిక్ సక్సెస్ మీట్ ప్రోగ్రాం ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వివిధ రకాల సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు డాన్సులు అందర్నీ ఎంతగానో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో క్లాసికల్ డాన్స్. మాస్ డాన్స్, నృత్య ప్రదర్శనలు అందర్నీ ఎంతగానో అలరించాయి. యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఒక మైలురాయి దాటి ప్రైమరీ లెవెల్‌లోకి వెళ్లడం వల్ల గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో జగన్ గురుజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తల్లిదండ్రులకు విద్యార్థులకు పట్ల సంబంధాన్ని ఎలా పెంపొందించుకోవాలి.. విద్యార్థులను ఎలా తీర్చిదిద్దాలో వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ మాట్లాడుతూ లిల్లీపుట్ పాఠశాలలో ప్రతి ప్రోగ్రాం ఎంతో ఘనంగా నిర్వహిస్తారని, ఈరోజు సక్సెస్మెంట్ ప్రోగ్రాం ఇలా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన అద్భుతంగా ఉన్నాయని అభినందించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరెస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ పాఠశాలలో ఆకాడమిక్ సక్సెస్ మీట్ ప్రోగ్రాం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, ఈ సంవత్సరం ఈ అకాడమిక్ ఇయర్ ఎన్నో విజయాలు సాధించామని ముఖ్యంగా అబాకస్ లో స్టేట్ లెవెల్ రావడం ఒలంపియాడ్‌లో తమ పాఠశాలలో చాలామంది విద్యార్థులు స్టేట్ లెవల్లో ఉత్తీర్ణులు కావడం, ఎస్ఎలొసి సైన్స్ పెయిర్ ఇటువంటి వాటిలో మంచి ప్రదర్శనలు ఇవ్వడం, స్పోర్ట్స్ మీట్ లో ఉత్తర్ ప్రదేశ్ కి వెళ్లి కబడ్డీ పోటీలోబహుమతి రావడం ఇలా ఎన్నో విజయాలు ఈ అకడమిక్ ఇయర్‌లో సాధించామని అన్నారు. విద్యార్థులను మంచి ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని, విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించడం బాధ్యత అని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ అన్ని రంగాల్లో రాణించిన వారు ఉండడంవల్ల ప్రతి కార్యక్రమంలో విద్యార్థులను పాల్గొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దాసు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ జగన్ ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీధర్ వివిధ స్కూల్ యజమాన్యాలు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

'శ్రీరామ నవమి' శుభాకాంక్షలు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ముత్యాల సునీల్ రెడ్డిని ఆదివారం కలిసి 'శ్రీరామ నవమి' శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వేంపల్లి మాజీ ఉప సర్పంచ్‌లు ఏట్టెం మహేష్, జక్క గంగాధర్, యూత్ అధ్యక్షులు ధనుష్ యాదవ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగారాం, నాయకులు, తదితరులు ఉన్నారు.

రాష్ట్ర కమిటీ సభ్యుని మరణం పార్టీకి తీరని లోటు : సీపీఐ(ఎం)


నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఖమ్మం జిల్లాకు చెందిన ఎర్ర శ్రీకాంత్ గుండె నొప్పితో చనిపోవడంతో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ.. పార్టీ అఖిల భారత మహాసభలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎన్నికైన ప్రతినిధిగా పాల్గొన్నారన్నారు. చివరి రోజు ఆదివారం గుండె నొప్పి రావడంతో అక్కడే ప్రాణాలు వదిలారని తెలిపారు. ఎర్ర శ్రీకాంత్ ఖమ్మం జిల్లాకు చెందిన వారని అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొని దోపిడీ లేని సమ సమాజ నిర్మాణం కోసం పరితపించారని అన్నారు. గత రెండు మహాసభల నుండి రాష్ట్ర కమిటీకి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఆయన మరణం పార్టీ ఉద్యమానికి తీవ్ర లోటని, ఆయన ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూర్జహాన్ జిల్లా కమిటీ సభ్యులు విగ్నేష్, నాయకులు కటారి రాములు, ఉద్ధవ్, దినేష్, రాజు, సుచిత్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఓఆర్ఎస్‌లతో జాగ్రత్త

- డబ్ల్యూహెచ్వో నిర్ధారించిన ఓఆర్ఎస్ మాత్రమే తాగాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ఇది ఒరిజినల్ ఓఆర్ఎస్

వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (ప్రపంచ ఆరోగ్య సంస్థ) సిఫార్సు చేసిన ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్)నే వాడా లని వైద్య నిపుణులు కోరుతు న్నారు. వేసవి కాలంలో డీహైడ్రేషన్‌కు గురిఅయ్యే ప్రమాదం ఉందని, వైద్యులు అంటున్నారు. కూల్ డ్రింకులు, ఐస్ క్రీములు, పంచదార ఎక్కువ కలిపిన జ్యూస్లు పిల్లలకు ఇవ్వడం వల్ల డిహైడ్రేషన్ ప్రభావం పెరుగుతుందని చిన్నపిల్లల వైద్యులు చెబుతున్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సిఫార్సు చేసిన ఓఆర్ఎస్‌ని తీసుకోవాలని వైద్య నిపుణులు కోరుతున్నారు. 2022 ఏప్రిల్ 8న (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీస్ ఆఫ్ ఇండియా) ఎఫ్ఎస్ఎస్ఎఐ వారు ఒక ప్రత్యేకమైన నోటీసులు విడుదల చేసింది. పండ్ల రసాలకు ఓఆర్ఎస్‌కు సంబంధించిన లేబుల్‌లను అతికించకూడదని ఆదేశాలు జారీ చేసింది. తప్పుడు లేబుల్ ఉన్న ఓఆర్ఎస్‌లను ఫార్మసీలలో, జనరల్ స్టోర్‌లో ఎక్కడ పడితే అక్కడ అమ్మకూడదని, వాటిని తీసుకోవడం వల్ల డిహైడ్రేషన్ పెరుగుతుందని, దాని ద్వారా అనారోగ్య సమస్య పెరుగుతుందని వివరించారు. ముఖ్యంగా షుగర్ పేషెంట్లు నకిలీ ఓఆర్ఎస్‌లు తీసుకోవడంతో శరీరంలో మరింతగా డీహైడ్రేషన్ పెరుగుతుందని, వైద్యులు అంటున్నారు.

ఐకెపి సెంటర్లు ఏర్పాటు చేసి ప్రోత్సహించింది కాంగ్రెస్సే

జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు ఎంపాల రాధా

నవతెలంగాణ-ధర్పల్లి

రాష్ట్రంలోని మహిళలకు పెద్ద పీటవేసి మహిళలకు స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తూ ప్రభుత్వం ఐకెపి మహిళా సంఘాలకు గ్రామగ్రామాన సెంటర్లు ఏర్పాటు చేసి వారిని ఆదుకునే చర్యలు తీసుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని జిల్లా సమైక్య అధ్యక్షురాలు ఎంపాల రాధ అన్నారు. ఆదివారం ఆమె మండలంలోని ఎస్సి తండా, దుబ్బాకగ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే అవకాశాన్ని అందిపుచ్చుకొని ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేవిధంగా పనిచేస్తామని తెలిపారు. సెంటర్లలో రైతులకు ఇబ్బందులు కల్గకుండా లారీల కొరత, గన్ని బ్యాగుల కొరత లేకుండా చూస్తామని అన్నారు. ౦ ధాన్యాన్ని సెంటర్లకు పంపేటప్పుడు తమ పేర్లను నమోదు చేసుకొని సీరియల్ ఆధారంగా కాంటాలు వేసేవిధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, పోతన్న, నరేష్, శేఖర్ రెడ్డి, నరేష్ గౌడ్, శంకర్ నాయక్, ఏపీఎం సునీత మండల సమాఖ్య అధ్యక్షురాలు మద్నూరు లావణ్య, సీసీలు సునీత, శాంతా, గ్రామసంఘం అధ్యక్షురాలు సౌజన్య, కవిత, లత, వికలు నయీమ్, లక్ష్మణ్, రోహిత్ పాల్గొన్నారు.

జై బాపు.. జై భీమ్ జై సంవిధాన్ పాదయాత్ర

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 44, 46 డివిజన్లో ఆదివారం జై బాబు జై భీమ్ జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ ర్యాలీలో నుడా చైర్మన్ కేశవేణు, రత్నాకర్, జావేద్ అక్రమ్, కార్పొరేటర్ రాజేంద్రప్రసాద్, రాజేష్, రాజా గౌడ్, వినయ్, సుజాత, జాఫర్ అయూబ్, అపర్ణ, వేణు రాజ్, శేఖర్, రామకృష్ణ దేవిదాస్, రేవతి, ఉష, మలైకా, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విద్యాసాయిలో 25వ వార్షికోత్సవం

- అలరించిన బుల్లితెర నటుల ప్రదర్శనలు



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని హాస కొత్తూర్ రోడ్డులో గల శ్రీ విద్యా సాయి ఉన్నత పాఠశాల 25 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో బుల్లితెర నటులు జబర్దస్త్ పైమా, నూకరాజు ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల శాస్త్రీయ నృత్యాలు, నాటికలు ఆహుతులను ఉత్తేజపరిచాయి. కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్యేక ఆహ్వానితులను పాఠశాల యాజమాన్యం బృందం సభ్యులు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఏనుగు సత్యం రెడ్డి-సుశీల, పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి-ప్రమీల, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, కమ్మర్ పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, తాజా మాజీ ఎంపీపీ లోలపు గౌతమి, తాజా మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, తాజా మాజీ ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, ప్రధానోపాధ్యాయులు మంద శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్ జాన్ సుందర్, పాఠశాల ఇంచార్జ్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఇంద్రకరణ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

పిసిసి ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా దోమకొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు భిక్కనూరు మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఆదివారం శాలువాలతో సన్మానించి మెమోంటో అందజేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతో కషి చేశారని, భవిష్యత్తులో రాజకీయంగా ఉన్నత స్థాయిలో చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, నాయకులు నల్ల శ్రీనివాస్, పెద్దిరెడ్డి సిద్ధారెడ్డి, నాగారపు రాములు తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని బోధన్ రూరల్ సీఐ విజయబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత మత్తు పదార్థాలకు, గంజాయి, తదితర వ్యసనాలకు బానిసలు కావొద్దని, చదువుపై ఆసక్తి కనబరిచి క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ సభ్యులు సంతోష్, అఖిల్, రాజ్ కుమార్, మురళి, సంజీవ్, శివ, హరి, గంగోనీ తేజ, అక్షయ్, యోగేష్, అనూష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రూరల్ సీఐ

ఒప్పంద ఉద్యోగుల పొట్టకొడుతున్న సిరి ఏజెన్సీ

- పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కాజేసిన వైనం
- ఏజెన్సీ ఒప్పందం ముగిసి ఆరు నెలలు గడిచినా.. పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు ఇవ్వని వైనం
- అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు.. అయినా ఫలితం శూన్యం


నవతెలంగాణ-కామారెడ్డి

నిరుద్యోగులు వారు చదివిన చదువులకు ఉద్యోగాలు దొరక్క.. ఎక్కడో ఒకచోట పని చేసుకుందామని జీవనోపాధి కోసం పని చేసుకోవడానికి వెళితే మ్యాన్ పవర్ ఏజెన్సీలు తమ దోపిడీ విధానంతో ఒప్పంద ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వం వివిధ చోట్ల మ్యాన్ పవర్ ఏజెన్సీలకు ఒప్పంద ఉద్యోగాల నియామకాల టెండర్లను ఇస్తే దీన్ని ఆసరాగా చేసుకున్న మ్యాన్ పవర్ ఏజెన్సీలు ఒప్పంద ఉద్యోగులను దోచుకోవడమే తమ పనిగా పెట్టుకున్నాయి.

కామారెడ్డి జిల్లాలో మ్యాన్ పవర్ ఏజెన్సీ అయిన సిరి ఏజెన్సీ వారు నిర్వహించే ప్రతిచోట తన కక్కుర్తిని చూపెడుతూ కార్మికులను దోచుకుంటున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొన్ని విభాగాలలో 18 నెలల క్రితం ప్రస్తుత జీజీహెచ్ ఆస్పత్రిలో వివిధ విభాగాలలో సిరి ఏజెన్సీ కింద ఒప్పంద ఉద్యోగులుగా విధులు నిర్వహించిన వారికి ఇప్పటికీ పిఎఫ్, ఈఎస్ఐ చెల్లించలేదని ఆ ఒప్పంద ఉద్యోగులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఈ సిరి ఏజెన్సీ టెండర్ ముగిసి ఆరు నెలల గడిచినా ఇప్పటివరకు ఆ ఒప్పంద కార్మికుల పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు ఇవ్వడం లేదని ఆ ఉద్యోగులు వాపోతున్నారు. ఈ సిరి ఏజెన్సీకి కామారెడ్డితో పాటు దోమకొండ, బాన్సువాడ, ఎల్లారెడ్డి తదితరచోట్ల జిల్లా మొత్తంగా ఎక్కువగా ఈ ఏజెన్సీ కిందనే పనిచేస్తున్నట్లు సమాచారం. తాము సిరి ఏజెన్సీ కార్యాలయానికి వెళితే అక్కడ ఎవరూ ఉండడం లేదని, ఉన్నవారు సైతం సరిగా సమాధానం చెప్పడం లేదని ఆ ఉద్యోగులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు చేతికి ఇవ్వవచ్చా..?

ఉద్యోగులకు చెల్లించే పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులను సంబంధిత కంపెనీలే నేరుగా అకౌంట్లో జమ చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ సిరి ఏజెన్సీ మాత్రం కార్మికులకు చేతికి పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు ఇస్తోంది. అందులో పని చేస్తున్న ఉద్యోగులకు కొంతమందికి డబ్బులు చేతికి ఇచ్చి, ఇవి మీ పిఎఫ్ డబ్బులు అంటూ వేలు లేదా మూడు వేలు మాత్రమే ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికీ ఆ ఉద్యోగుల డబ్బులు చెల్లించకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. దీంతో విసిగిపోయిన ఉద్యోగులు గత మూడు నెలల క్రితం గత డిసెంబర్ నెలలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసినప్పటికీ విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆ ఒప్పంద ఉద్యోగులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఏజెన్సీలకు ఎక్కడ కూడా ఎలాంటి పనులను ఇవ్వకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.



కలెక్టర్‌కు ఒప్పంద ఉద్యోగులు ఇచ్చిన వినతిపత్రం

కార్మికులకు న్యాయం జరిగేనా..?

సిరి ఏజెన్సీలో పనిచేసిన కార్మికులే ఆ ఏజెన్సీ కింద పని చేసే ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తుందని పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు సరిగా ఇవ్వదని చెబుతున్నా మూడు నెలల క్రితం నుండి జిల్లా కలెక్టర్కు వినతి పత్రం సమర్పించినా ఇప్పటివరకు ఆ ఏజెన్సీపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో విసిగిపోయిన ఆ ఒప్పంద ఉద్యోగులు ఈ నెల 2న తిరిగి కలెక్టర్‌కు సిరి ఏజెన్సీ అక్రమాలపై ఫిర్యాదు చేశామని ఉద్యోగులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

సిరి ఏజెన్సీకి ఎన్‌ఓసి ఇచ్చిన అధికారులెవరు ?

సిరి ఏజెన్సీ తమ కింద పనిచేసే ఒప్పంద ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని ఆ ఉద్యోగులే అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ అలాంటి సిరి ఏజెన్సీ తిరిగి ప్రభుత్వం ప్రకటించే టెండర్లో పాల్గొనాలంటే గతంలో వారు పనిచేసిన చోటు నుండి ఎన్‌ఓసి సర్టిఫికెట్‌ను సమర్పించవలసి ఉంటుంది. సిరి ఏజెన్సీతో ప్రస్తుత జీజీహెచ్ ఆసుపత్రిలో ఒప్పంద ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని వారు చెప్పడం, అధికారులకు లిఖితపూర్వకంగా సైతం ఫిర్యాదులు చేసినా ఆ సిరి ఏజెన్సీకి ఎన్‌ఓసి ఇచ్చిన అధికారులు ఎవరో ఎవరికీ అంతు పట్టడం లేదు. అక్రమార్కులకు అండగా నిలుస్తున్న ఆ ప్రభుత్వ ఉద్యోగులు ఎవరో అని, ఎవరు వారిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కామారెడ్డి పట్టణ ప్రజల కోరుతున్నారు.

సిరి ఏజెన్సీతో బాధలు చాలు



సిరి ఏజెన్సీతో ఇప్పటివరకు మేము పడ్డ బాధలు చాలు. అలాంటి ఏజెన్సీ మాకు వద్దు. మాకు ప్రతి నెల చెల్లించే పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు చెల్లించకుండా మాకు పీఎఫ్, ఈఎస్ఐ వల్ల కలిగే లాభాలను నష్టపోయాం. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ఒప్పంద ఉద్యోగులకు న్యాయం చేసే ఏజెన్సీలకు మాత్రమే ఇవ్వాలి.

- ప్రమోద్, ఒప్పంద ఉద్యోగి

ఇలాంటి ఏజెన్సీని చూడలే



నేను పది సంవత్సరాలుగా ఒప్పంద ఉద్యోగినిగా ఇదే ఆసుపత్రిలో పనిచేస్తున్నా. కానీ సిరి ఏజెన్సీ మాదిరి ఏజెన్సీలను ఇప్పటివరకు నేను చూడలేదు. ప్రతి దాంట్లో కార్మికులను ఇబ్బంది పెట్టడం వారి లక్ష్యంగా ఉంది. పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు చెల్లించకుండా మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ సిరి ఏజెన్సీ మాకు వద్దు.

- రజిత ఒప్పంద ఉద్యోగిని



స్థానికులకూ టోల్

నిబంధనలు పాటించని భిక్కనూర్ టోల్‌ప్లాజా సిబ్బంది

- టోల్ వసూలు చేయడమే లక్ష్యం
- లోకల్, నాన్‌లోకల్‌తో సంబంధం లేని వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న భిక్కనూర్ టోల్‌ప్లాజా మేనేజర్‌తో పాటు సిబ్బందికి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఎవరి వద్ద టోల్ ప్లాజా డబ్బులు వసూలు చేయాలో ఎవరి వద్ద చేయకూడదో తెలియదా లేకపోతే తెలిసే వసూలు చేస్తున్నారన్న అనుమానాలను సైతం స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.



ప్రతిరోజు స్థానికులు ఈ గ్రామం నుండి ఆ గ్రామానికి ఆ గ్రామంలో నుండి ఈ గ్రామానికి వెళుతూ వస్తుంటారు. వెళ్లిన ప్రతిసారి టోల్ ప్లాజాలో డబ్బులు చెల్లించాలంటే నెలకు సుమారు అయిదారువేల వరకు అవుతుందని పలువురు పేర్కొంటున్నారు. 20 కిలోమీటర్ల వరకు టోల్ ప్లాజాకు డబ్బులు చెల్లించవలసిన అవసరం లేదు. నేషనల్ హైవే అథారిటీ నిబంధనల ప్రకారం 20 కిలోమీటర్ల వరకు ఉన్న స్థానికులు ఎవరైనా సరే టోల్ ప్లాజాలో డబ్బులు కట్టవలసిన అవసరం లేదు. ఐదు కిలోమీటర్ల లోపల ఉన్నవారు సైతం టోల్ ప్లాజాలో డబ్బులు చెల్లించాలని భిక్కనూర్ టోల్‌ప్లాజా సిబ్బంది స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిరోజు జిల్లా విలేకరులు వివిధ వార్తల సేకరణకు జిల్లాలో ప్రతి మండలానికి తిరుగుతుంటారు. అందులో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి భిక్కనూర్ మండల కేంద్రానికి వెళ్లాలన్నా, ఆ మండలంలోని ఏ గ్రామానికి వెళ్లాలన్న ఈ టోల్‌ప్లాజా దాటి వెళ్లవలసిందే. అయితే టోల్ ప్లాజా సిబ్బంది మాత్రం వెళ్ళిన ప్రతిసారి డబ్బులు చెల్లించాల్సిందేనని ఒత్తిడి తెస్తున్నారని పలువురు జర్నలిస్టులు సైతం పేర్కొంటున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు, జర్నలిస్టులు కోరుతున్నారు.

కాల్చివేత.. కూల్చివేత

- మర్రి వక్షాలకు మనుగడ కరువు
- కనుమరుగైపోతున్న మర్రి వక్షాలు
- వేల నుంచి వందల సంఖ్యలో..
- నిలువ నీడ కరువు

నవతెలంగాణ-లింగంపేట్

అశోక చక్రవర్తి నిజాంపాలనలో నాటిన మర్రి వక్షాలు మనుగడ ప్రస్తుతం కరువైపోతుంది. రోజురోజుకు మర్రి వక్షాలను కొందరు కావాలని కాలబెడుతూ కూల్చేస్తున్నారు. గతంలో వేల సంఖ్యలో ఉన్న మర్రి వక్షాలు ప్రస్తుతం మందల సంఖ్యల్లో దర్శనమిస్తున్నాయి. రానున్న రోజుల్లో పర్యావరణానికి ముప్పు ఏర్పడే అవకాశాలున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 'మొక్కలు పెంచాలి. పర్యావరణాన్ని కాపాడాలి. చెట్లు పెంచితేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి' అని ప్రభుత్వం చెబుతున్నా.. కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా.. పూర్వపు కాలంలో నాటి ఎదిగిన మర్రి చెట్లను కాపాడలేకపోతుందని పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



మర్రిచెట్టు నరికివేయడంతో మిగిలిన చెట్టు మొదళ్లు

అశోక చక్రవర్తి పాలనతో పాటు నిజాంపాలనలో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నప్పుడు నిజాం నవాబు ప్రధాన రహదారులకు రోడ్డుకు ఇరువైపులా మర్రి వక్షాలు నాటినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు చేపట్టేటప్పుడు ముడి సరుకులు ప్రాజెక్టు అవసరమైనటువంటి వస్తువులను తీసుకురావడానికి దూర ప్రాంతాల నుండి దిగుమతి చేసుకోవడానికి రోడ్డుకిరువైపులా మర్రి వృక్షాలు నాటినట్లు పూర్వీకులు చెప్పున్నారు.

కామారెడ్డి జిల్లాలో గతంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా వేల సంఖ్యలో మర్రి వక్షాలు ఉండేవి. ఎండాకాలంలో వాహనదారులకు, కాలినడకన రాకపోకలు సాగించేవారికి, పర్యాటకులకు, పశువుల కాపరులకు, కూలీలకు ఎండాకాలంలో చల్లటి నీడనిచ్చేవి. దూర ప్రాంతాల నుంచి ప్రయాణం చేసే టూరిస్టులు వాహనదారులు ఎండ తీవ్రతను తట్టుకోలేక మర్రి చెట్ల వద్ద గంటపాటు సేద తీర్చుకునేవారు. ప్రస్తుతం మర్రి చెట్లు లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా మైదాన ప్రాంతాలుగా దర్శనమిస్తున్నాయి. గతంలో రోడ్డుకు పచ్చని తోరణంలా అడుగడుగునా మర్రి చెట్లు ప్రజలకు స్వాగతం పలుకుతుండేవి. ప్రస్తుతం అలాంటి చెట్లు కనిపించకుండా పోతున్నాయి.

ఈ ప్రాంతాల్లో అధికం..

జిల్లాలోని కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా 45 కిలోమీటర్ల వరకు ఎర్రపాడు, మోతె, గాంధీనగర్, బురిగిద్ద, ముస్తాపూర్, లింగంపల్లి, లింగంపేట్, మెంగారం, లక్ష్మాపూర్, అడవి లింగాల్, మాసనపల్లి, ఎల్లారెడ్డి అంబేద్కర్ చౌరస్తా వరకు రోడ్డు కిరువైపులా, అదేవిధంగా ఎల్లారెడ్డి నుంచి మెదక్ వెళ్లే ప్రధాన రహదారి మెదక్ వరకు నాగిరెడ్డిపేట్, తాండూర్, పెద్దారెడ్డి, ధర్మారెడ్డి, రాఘవపల్లి, మల్లయ్యపల్లి, సాతెల్లి, శివనగర్, ఎల్లారెడ్డిత పెద్ద చెరువు కట్ట పైనుండి ఎల్లారెడ్డి వరకు, అలాగే ఎల్లారెడ్డి నుండి నిజాంసాగర్ వరకు నిజాంసాగర్ నుండి పిట్లం వరకు బొగ్గు గుడిసె నుండి మమ్మద్‌నగర్, బాన్సువాడ వరకు, కామారెడ్డి నుండి సదాశివనగర్, బాన్సువాడ ఎక్స్ రోడ్ నుండి బాన్సువాడ వరకు గాంధారి మీదుగా వేల సంఖ్యలో ఉన్న మర్రి వక్షాలు వేల సంఖ్యలో నుంచి పదుల సంఖ్యలోకి చేరుకున్నాయి.



ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

నవతెలంగాణ-తాడ్వాయి



ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. ఆదివారం శబరిమాత ఆలయంలో 25వ రజతోత్సవ వార్షికోత్సవాల్లో భాగంగా జరిగిన శ్రీరామనవమి ఉత్సవాల్లో జరిగిన సీతారాములు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. శబరీమాత ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని వివరించారు. అనంతరం అన్నప్రసాదం వడ్డించారు. ఎర్ర పహాడ్, కనుకల్ గ్రామాల్లో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తాడ్వాయి సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి, జక్కుల రాజిరెడ్డి, గైని శివాజీ, బండారు సంజీవ్, మేకల రాజు, గైని రాజలింగం, శ్యామ్‌రావు, సంతాజీగారి సుధాకర్‌రావు, ఏనుగు మోహన్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, టి.మోహన్‌రెడ్డి, శ్యామ్, లక్ష్మణచారి, రామచంద్రం, ఆయాగ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


గాంధారిలో నేడు కుస్తీ పోటీలు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో శ్రీరామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్టు శ్రీరామ ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే శ్రీరామనవమి మరుసటి రోజున కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మల్లయోధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహిళ అదృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి



గొల్లవాడకు చెందిన కొట్టూరి లక్ష్మీ స్వరూప (50) అనే మహిళ శనివారం ఉదయం 5 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. భర్త కొట్టూరి సంపత్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈమె ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ 8712686145, 8712666242 నెంబర్లకు తెలియజేయాలని తెలిపారు.

నీటి సమస్యను పరిష్కరించిన పంచాయతీ సిబ్బంది

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కంచర్ల గ్రామంలో నీటి సమస్యను గుర్తించి పంచాయతీ కార్యదర్శి స్వప్న సిబ్బంది చేత నీటి సమస్యను పరిష్కరించారు. పైపు లీకేజ్, బోరు మోటర్ సమస్య కారణంగా నీటి సమస్య ఏర్పడిందని తెలిపారు. గ్రామంలోని సమస్యలు పంచాయతీ కార్యాలయంలో తెలియజేయాలని కార్యదర్శి సూచించారు.

ప్రారంభించారు.. వదిలేశారు

- పూర్తికాని లాడేగావ్ రోడ్డు పనులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని లాడేగామ్ గ్రామం గత 20 ఏళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డు ప్రస్తుతం గుంతలమయంగా మారడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా తమ గ్రామ రోడ్డు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సరిగా లేక ఈ గ్రామానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు, వద్ధులు, మహిళలు, ఉద్యోగులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హడావిడిగా పనులు ప్రారంభించింది. ఉన్న రోడ్డును నాలుగు కిలోమీటర్ల మేర తవ్వేసి అనంతరం కంకర వేశారు. ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. ఈ ప్రభుత్వమైనా సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాల సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి గ్రామంలో ఆదివారం మాల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్టు సంఘం సభ్యులు తెలిపారు. అధ్యక్షులుగా మామిండ్ల రాజయ్య, కోశాధికారి మామిండ్ల మోహన్, కార్యదర్శి మామిండ్ల శివరాజు, కార్యవర్గ సభ్యులు మంత్రి లింగం, మామిండ్ల చిన్న సాయిలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.